క్లుప్తంగా

ఎయిడ్స్ రోగులపై వివక్ష తగదు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రవికుమార్

అద్దంకి: హెచ్ఐవీ ఎయిడ్స్ రోగులపై వివక్ష తగదని మున్సిపల్ కమిషనర్ టీ రవికుమార్ అన్నారు. ఎయిడ్స్‌తో నిరాదరణకు గురైన మహిళలకు ప్రభుత్వ పథకాలు అందే విధంగా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి హెల్ప్ టీఐ మేదరమెట్ల ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్ తన సిబ్బందితో అద్దంకి మున్సిపల్ కమిషనర్‌ను కలిశారు. కార్యక్రమంలో హెల్ప్ టీఐ అద్దంకి అవుట్ లెట్ రిచ్ వర్కర్ కరుణ, పీర్ ఎడ్యుకేటర్లు పీ మల్లేశ్వరి, శివపార్వతి, పార్వతి, రాధ పాల్గొన్నారు.

టీచర్ వైద్యానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న శ్రీరామచంద్రమూర్తి

అద్దంకి: ఓ ప్రైవేటు పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్న తిరుమలశెట్టి వెంకటేశ్వర్లుకు సోమవారం అకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. దాంతో కుటుంబ సభ్యులు అతన్ని గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. పేద టీచర్ కావడంతో ఆయన వైద్యం కోసం రూ.10 వేలను పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ తరుపున పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి మంగళవారం ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలో చాలీ చాలని వేతనంతో పనిచేస్తున్న వెంకటేశ్వర్లు వైద్య ఖర్చులను అందించేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఎన్సీడీ సీడీ సర్వేలో వేగం పెంచాలి



సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కారంచేడు: ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది గ్రామాల్లో నిర్వహిస్తున్న ఎన్సీడీ సీడీ సర్వేను వేగవంతంగా పూర్తి చెయ్యాలని పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్ జెస్సీరాణి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆమె మండల కేంద్రం కారంచేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఏర్పాటు చేసిన సిబ్బంది సమావేశంలో మాట్లాడారు. మండలంలోని కారంచేడు పీహెచ్సీ ప్రస్తుతం 81 శాతం మాత్రమే ఉందని కలెక్టర్, జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు నూరు శాతం పూర్తి చేసేందుకు ఏఎన్ఎంలు, ఆశలు, గ్రామాల్లోని వలంటీర్ల సహకారంతో పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సువర్ణ జ్యోతి, హెచ్‌వీలు వీరమ్మ, వసంతవల్లి, శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు నగదు వితరణ



ఆర్వో ప్లాంట్ వద్ద దాతలు

జే.పంగులూరు: మండలంలోని చందలూరు గ్రామంలోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న ఆర్వోప్లాంట్ ఆధునికీకరణ పనులకు రూ. 60 వేల పాఠశాల పూర్వ విద్యార్థి రావూరి శివరామ ప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల ఆవరణంలో హెచ్ఎం గుమ్మా శ్రీనివాసరావు అధ్యక్షతన పూర్వవిద్యార్థికి ధన్యవాదాల సభ ఏర్పాటు చేశారు. ఇచ్చిన డబ్బులతో విశ్రాంత హెచ్ఎం తాతయ్యకు పనులను దగ్గర ఉండి పని పూర్తి చేయించిన, పాఠశాల ప్రధాన దాత వారసుడు అడ్డగడ సుబ్బయ్యకు దాత కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు, శేషారావు పాల్గొన్నారు.

పాలీసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

అద్దంకి: పదో తరగతి పరీక్షలు రాస్తున్న, పాసైన విద్యార్థులు పాలిటెక్నిక్‌లో చేరేందుకు నిర్వహించే పాలిసెట్ పరీక్ష తేదీని ప్రభుత్వం నిర్ణయించినట్లు అద్దంకి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఏవీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష మే 10వ తేదీన నిర్వహిస్తారని తెలిపారు. పాలిసెట్ ఎంట్రన్స్ పరీక్ష రాసే విద్యార్థులు ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభించగా, ఏప్రిల్ 4వ తేదీ లోగా ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. పరీక్ష ఫీజును స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలోనూ చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అయితే రూ.100 చెల్లించాలన్నారు.

బాలికా భయపడకు..!

- విద్యార్థినుల రక్షణకు ప్రభుత్వం పెద్దపీట
- గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన
- పాఠశాలలో 'భరోసా బాక్స్'ల ఏర్పాటు



ఈపూరుపాలెం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన భరోసా బాక్స్

చీరాల అర్బన్: ఆడపిల్లలు అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారు. ఏరంగంలో అయినా ఎక్కడైనా తమదైన ముద్రవేసి పురుషులతో సమానంగా ఉంటూ కీర్తిప్రతిష్టలు సాధిస్తున్నారు. బాలికా విద్యకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ వారికి ఒక భరోసా కల్పిస్తోంది. ఏదో ఒక ప్రాంతంలో బాలికలపై లైంగిక వేధింపులు, కంటికి పాపలా కాపాడాల్సిన తండ్రే కుతూరుపై లైంగిక వేధింపులు ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. ఆపద సమయంలో ఉన్నవారిని రక్షించేందుకు ప్రభుత్వం దిశ యాప్‌ను తీసుకువచ్చింది. మహిళలపై లైంగిక వేధింపులకు అడ్డుకట్ట వేసేందుకు తీసుకువచ్చిన దిశ యాప్ విమర్శకుల ప్రశంసలను అందుకుంది. ఇప్పుడు పాఠశాలలోని బాలికల భద్రతపై ప్రత్యేక దృష్టిసారించింది. వారికి భద్రత కల్పించేందుకు, స్వేచ్ఛగా పాఠశాలకు వచ్చేందుకు పాఠశాలలో 'భరోసా బాక్సులు' ఏర్పాటు చేసింది. జిల్లాలోని పలు ఉన్నత పాఠశాలలో భరోసా బాక్సులు ఏర్పాటు చేయడంతో పాటు వారికి అవగాహన కల్పించేందుకు కరపత్రాలు, పోస్టర్లను పాఠశాలలో ఏర్పాటు చేశారు.

చట్టాలపై అవగాహన..

పాఠశాలల్లో ఇప్పటికే విద్యార్థినులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. మహిళా పోలీసులు, ఏఎన్ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రతి వారం నిర్దేశిత రోజుల్లో పాఠశాలలను సందర్శిస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థినుల ఆరోగ్యంతో పాటు వారు లైంగికంగా ఎదుర్కొనే అంశాలపై కూడా అవగాహన కల్పిస్తున్నారు. అలానే ఈవ్‌టీజింగ్, పోక్సో చట్టం, బాల్య వివాహాలు, దిశయాప్ ఉపయోగించే విధానం, ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నారు. బాలికా సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్లతో ముద్రించిన పోస్టర్లను విద్యార్థినులు, సందర్శకులకు కనిపించేలా ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థుల డ్రాపౌట్లు, మధ్యాహ్న భోజన తనిఖీ, ఆహార భద్రత, మరుగుదొడ్లలో పరిశుభ్రత తదితర అంశాలను ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు పర్యవేక్షిస్తున్నారు.

అందరికీ కనిపించేలా భరోసా బాక్సులు..

- బాలికల రక్షణ, వారి భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాలల్లో భరోసా బాక్సులు ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. చీరాల మండలంలో మొత్తం ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు 165 ఉన్నాయి. వీటిలో భరోసా బాక్సులు ఏర్పాటు చేశారు. పాఠశాలలో హెచ్ఎం గది వద్ద అందరికీ కనిపించేలా ఉంచారు.
- విద్యార్థులకు ఎదురయ్యే లైంగిక వేధింపులు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర సమస్యలను నేరుగా చెప్పుకోలేని వారు లెటర్ రూపంలో రాసి బాక్సులో వేయాలి.
- తాళం వేసిన బాక్సును ప్రతి 15 రోజులకు ఒకసారి ఎంఈవో పర్యవేక్షణలో మహిళా పోలీసు, ఏఎన్ఎం సమక్షంలో తెరిచి, అందులోని ఫిర్యాదులు, సూచనలు, సలహాలను పరిశీలిస్తారు.
- సమస్యలు, ఫిర్యాదులు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతారు.

> **అన్ని పాఠశాలలో ఏర్పాటు చేశాం..**
> విద్యార్థినుల రక్షణకు, భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఇప్పటికే నిత్య జీవితంలో ఎదుర్కొనే సమస్యలపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నాం. పాఠశాలల్లో పక్కాగా భరోసా బాక్సులు ఏర్పాటు చేశాం. ప్రతి 15 రోజుకు ఒకసారి బాక్సులు తెరచి విద్యార్థినుల సమస్యలను తెలుసుకుంటున్నాం.
> డీ.నాగేశ్వరరావు, ఎంఈవో

తేనెలొలుకు భాష.. తెలుగు భాష



తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మున్సిపల్ కమిషనర్ ఐసయ్య



అద్దంకిలో అవధానిని సన్మానిస్తున్న పుట్టంరాజు, సాహితీవేత్తలు



చీరాల: ఏఆర్ఎం హైస్కూల్‌లో గిడుగు చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు

- ఘనంగా మాతృభాషా దినోత్సవం

చీరాల అర్బన్: తేనెలొలుకు భాష.. తెలుగు భాష అని మున్సిపల్ కమిషనర్ ఐసయ్య పేర్కొన్నారు. మాతృ భాష దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని తెలుగు తల్లి విగ్రహానికి మున్సిపల్ కమిషనర్ ఐసయ్య పూల మాలలు వేశారు. కార్యక్రమంలో నేతాజీ సేవా సమితి చీరాల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో అన్నంరాజు సుబ్బారావు, సాయిబాబా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలానే మాతృభాషా దినోత్సవం సందర్భంగా పేరాలలోని ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగుని సుసంపన్నం చేసిన గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎం బి.సాల్మన్ మాట్లాడుతూ మనిషి తన భావాలను వ్యక్తపరిచే ఒక సాధనం భాష అని, భూమిపై ఉన్న అన్ని జీవరాశుల్లో మానవుడు ఒక్కడే తన భావాలను మాటల రూపంలో వ్యక్తం చేయగలుగుతాడన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.శివవరప్రసాద్, టి.చంద్రశేఖర్, భానుచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు. అలానే నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో బహుమతులు అందించారు. మొదటి బహుమతి బి.అమరదీపిక (కస్తూరిబా హైస్కూల్), రెండో బహుమతి వి.రాఘవేంద్రాచారి (ఎన్ఆర్‌పీఎం హైస్కూల్), మూడో బహుమతి సయ్యద్ యాసిన్‌బాషా (ఎన్ఆర్‌పీఎం హైస్కూల్), నాలుగో బహుమతి ఎం.గాయత్రి (కస్తూరిబా హైస్కూల్)లు సాధించారు. కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

అవధానం తెలుగు వారి సొంతం..

అద్దంకి: అవధానం తెలుగువారికి సొంతమని పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అన్నారు. అంతర్జాతీయ మాతభాషా దినోత్సవ సందర్భంగా సృజన సంస్థ ఆధ్వర్యంలో పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో అష్టావధాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హెచ్ఎం సరాల చినగురవయ్య అధ్యక్షతన కాకానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఇలపావులూరి శేషశ్రీధర శర్మ 11వ అష్టావధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అవధాని దత్తపది, వర్ణన, సంఖ్యా గణితం, అప్రస్తుతం, వంటి అంశాలకు విసిరిన చలోక్తులు, వ్యస్తాక్షరికి సందర్భ సహిత పద్యాలు సాహితీవేత్తలను సాధారణ వ్యక్తులను ఆకట్టుకున్నాయి. దత్తపదికి పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, వర్ణనకు డాక్టర్ జే ప్రతాప్, ఆశువుకు లక్కరాజు శ్రీనివాసరావు, వ్యస్తాక్షరికి ఉండవల్లి ఈశ్వరమ్మ, యాంత్రిక గణితానికి కే శ్రీనివాసరావు, అప్రస్తుతానికి అనీలకుమారసూరి, పృచ్ఛకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో అనురాధాకుమారి, వీవీ రామకష్టారావు, సీహెచ్ లక్ష్మి శ్రీనివాసులు, జీ సునిత, ఆర్ పద్మావతి, యంవీ శేషుబాబు, సీహెచ్‌వి సుబ్బారావు పాల్గొన్నారు.



అక్షరంలో ఉన్న మున్నంవారిపాలెం విద్యార్థులు

చినగంజాం: మున్నంవారిపాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో మాతృబాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులు తెలుగు అక్షర మాలలోని అ అనే అక్షర ఆకృతిని ప్రదర్శించారు.

మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు కృషిచేయాలి

- జేసీఎస్ రీజినల్ కోఆర్డినేటర్ రవీంద్రారెడ్డి, శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్య



మాట్లాడుతున్న శాప్‌నెట్‌చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

మేదరమెట్ల: త్వరలో జరగనున్న ఎన్నికల్లో మరలా తిరిగి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ఇప్పటి నుంచే కృషి చేయాలని జేసీఎస్ రీజనల్ కోఆర్డినేటర్ కందుల రవీంద్రారెడ్డి అన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామంలో గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లతో మంగవారం సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రీజనల్ కో-ఆర్డినేటర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అందచేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజల్లోకి తీసుకుపోవాల్సిన బాధ్యత గృహసారథులపై ఎంతగానో ఉందన్నారు. ఎల్లో మీడియా ప్రతిపక్షాలు చేస్తున్న అసత్యాల గురించి, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందచేస్తున్న పథకాల గురించి ఇంటింటికీ తిరిగే సమయంలో ప్రజలకు వివరించాలన్నారు. శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు అందజేస్తున్న సంక్షేమ ఫలాల గురించి ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సాదినేని ప్రసన్నకుమారి, మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

అద్దంకి: అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మూడు రాజధానులను ఎంచుకుందని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. ఆయన మంగళవారం సంతమాగులూరు మండల గృహసారథులు, సచివాలయ కన్వినర్ల శిక్షణ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ యల్లమంద, జెడ్పీటీసీ అడవి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతంలో సోషల్ మీడియానే కీలకం




సోషల్ మీడియా కన్వీనర్లతో మాట్లాడుతున్న వెంకటేష్

- నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారం చేపట్టేందుకు సోషల్ మీడియా కన్వీనర్లు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. మంగళవారం రామకృష్ణాపురంలోని క్యాంప్ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్లు, కో-కన్వీనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. పార్టీని మరింత బలోపేతం చేస్తూ పార్టీ అభివృద్ధికి సోషల్ మీడియా కన్వీనర్లు సమష్టి కృషి చేయాలన్నారు. 2024 ఎన్నికలే లక్ష్యంగా చేసుకుని కన్వీనర్లు చేయాల్సిన కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను రానున్న ఎన్నికల్లో గెలిపించి మరలా ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, సోషల్ మీడియా కన్వీనర్లు పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన ఆమంచి



వైవీ సుబ్బారెడ్డితో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి

పర్చూరు: తిరుమల తిరుపతి దేవస్థానముల చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఆయన విశాఖపట్నం జిల్లా మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలసి వెళ్లి మాట్లాడారు. నియోజకవర్గ పరిస్థితులు, పలు అభివద్ధి కార్యక్రమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారు చర్చించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక



ఇంటర్వ్యూల్లో ఎంపికైన విద్యార్థులతో యాజమాన్యం

చీరాల: చీరాల ఇంజినీరింగ్ కాలేజీలో బిట్ ల్యాబ్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ బెంగుళూరు ఆధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 22 మంది ఎంపికయ్యారు. కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులు రాకేష్ బృందం ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియలో రాత పరీక్ష, సాంకేతిక పరిజ్ఞానంపై పరీక్ష నిర్వహించారు. బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న ఈసీ, ఈఈఈ, సీఎస్ఈ విద్యార్థులు 70 మంది హాజరుకాగా వీరిలో 22 మంది ఎంపికకాగా వీరికి కళాశాల, కంపెనీ ప్రతినిధులు నియామక పత్రాలను అందించారు. పెద్ద సంఖ్యలో తమ కళాశాల విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఉద్యోగాలు సాధించడం హర్షణీయమని ప్రిన్సిపాల్ పి.రవికుమార్ అన్నారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బాజీ షాహిద్, హెచ్ఓడి షేక్ బషీరా, సౌజన్య, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఐదు గంటలు తగ్గకుండా పనులు



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

బల్లికురవ: ప్రభుత్వం వలసలను నిరోధించేందుకు ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకంలో ప్రతి కూలీ రోజుకు 5 గంటలు తగ్గకుండా పనులు చేయాలని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ కోరారు మంగళవారం కొమ్మినేనివారిపాలెంలో గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. పని ప్రదేశంలో వసతులు కల్పించుకోవాలని వేసవి దృష్ట్యా ఉదయం 6 గంటలకే పనుల్లోకి రావాలని ఎంపీడీవో కోరారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారం



పురస్కారాలు అందిస్తున్న ట్రస్టు అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి

చీరాల అర్బన్: బత్తుల సర్వీస్ ట్రస్టు ఆధ్వర్యంలో 2022 మార్చిలో జరిగిన ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు నగదు పురస్కారాలు అందించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమానికి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బత్తుల సర్వీస్ ట్రస్టు వ్యవస్థాపకులు, రిటైర్డు ప్రిన్సిపాల్ బత్తుల బ్రహ్మారెడ్డి ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ప్రతిభ చూపిన 14 మంది విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.7 వేలు చొప్పున నగదు పురస్కారాలను అందించి వ్యక్తిత్వ వికాసంపై సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో రిటైర్డు ప్రిన్సిపాల్ ఎ.నాగవీరభద్రాచారి, సీనియర్ సిటిజన్స్ చీరాల శాఖ అధ్యక్షుడు గాదె హరిహరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహాప్రస్థానం అంటేనే ఉత్తేజం

అద్దంకి రూరల్: యువకుల్లో ఉత్తేజాన్ని కలిగించిన గీతాలు శ్రీశ్రీవని సాహితీవేత్త అన్నమనేని వెంకటరావు అన్నారు. రెడ్ బుక్‌డే సందర్భంగా మంగళవారం రాత్రి స్థానిక సుందరయ్య భవన్‌లో శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం పుస్తకంపై చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమనేని వెంకటరావు మాట్లాడుతూ ఈ శతాబ్దం నాదని ప్రకటించిన మహాకవి శ్రీశ్రీ అని కొనియాడారు. రచయిత డీవీఎం సత్యనారాయణ మాట్లాడుతూ యువకుల్లో విప్లవ భావాలు రగించిన సూర్యుడు శ్రీశ్రీ అన్నారు. అనంతరం శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, చెన్నుపాటి రామాంజనేయులు, గాడేపల్లి దివాకరదత్తు, తాళూరి బాబూరావు, మన్నం త్రిమూర్తులు, సీహెచ్ గంగయ్య, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు పంపిణీ

అద్దంకి రూరల్: అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని ధర్మవరం గ్రామంలోని జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులకు రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులకు కళ్లజోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, కార్యదర్శి చిన్ని మురళీ కృష్ణ, కోశాధికారి తమ్మన శ్రీనివాసరావు, నర్రా శ్రీలక్ష్మీ, కొల్లా భువనేశ్వరీ, బంగారుబాబు, బూదాటి సుధాకర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామకృష్ణ మఠంలో ప్రత్యేక పూజలు

యద్దనపూడి: మండలంలోని పూనూరు గ్రామంలో వేంచేసియున్న రామకృష్ణ జ్ఞాన మందిరంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గత వారం రోజులుగా శివ అష్టోత్తర సహస్ర నామావళి, రుద్రాభిషేకం, రుద్ర హోమం, లలితా సహస్ర నామ పారాయణాలు నిర్వహించి మంగళవారం పూర్ణాహుతి గావించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో అక్కిచెర్ల కోదండ రామాంజనేయులు, ప్రసాద్, అంజిబాబు, మఠం నిర్వాహకులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్, ఈ-కేవైసీ నమోదు తప్పనిసరి

పర్చూరు: ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు, ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పర్చూరు మండల వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సిబ్బందితో ఆయన మాట్లాడారు. రైతులు రైతు భరోసా కేంద్రం సిబ్బందిని సంప్రదించి పంట నమోదు 25వ తేదీ లోపు చేయించుకోవాలని ఆయన తెలిపారు.

రేపు గృహ సారథుల ఆత్మీయ సమావేశం

వేటపాలెం: ఆణుమల్లిపేటలోని గ్రంధి వారి కళ్యాణ మండపంలో మండల పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల ఆత్మీయ సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారని చీరాల ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సమావేశానికి వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు హాజరు కానున్నారు. కావున కన్వీనర్లు, గృహసారథులు హాజరు కావాలని కోరారు.

గృహ ప్రవేశాలకు ఇళ్లు సిద్ధం కావాలి

బల్లికురవ: ఉగాదికి గృహప్రవేశాలు చేసేందుకు ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఆ శాఖ ఏఈ దుర్గా రమేష్ కోరారు. మంగళవారం రాత్రి కొణిదెన గ్రామ సచివాలయంలో గృహ లబ్ధిదారులు, వీవోఏలు, వలంటీర్లలతో అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామానికి 30 ఇళ్లు మంజూరు కాగా 6 ఇళ్లు నిర్మాణాలు చేపట్టలేదని, ఇంటి నిర్మాణానికి సంబంధించి వివిధ దశల్లో బిల్లులు చెల్లిస్తున్నామని ఏఈ వివరించారు. సదస్సులో గ్రామ పంచాయితీ సెక్రటరీ జీ. సీతామహాలక్ష్మి, వెలుగు ఏపీఎం సురేంద్రబాబు పాల్గొని మాట్లాడారు.